నా కు నచ్చిన నా కథ

# జగదాంబ జంక్షన్

గొరుసు జగదీశ్వరరెడ్డి

ఉదయం పది గంటల వేళ.

బంగాళాఖాతపు దిక్చక్రం దాటి, పైకెగబాకిన సూర్యుడు విశాఖనగరానికి నలభై ఐదు డిగ్రీల్లో ఏటవాలుగా వుండి, వేడి శరాల్ని సంధించి వొదులుతున్నాడు.

జగదాంబ జంక్షన్ హడావుడిగా తిరిగే మనుషులతో, వాహనాలతో సందడిగా వుంది. జూన్ మాసం వచ్చి రెండు వారాలు దాటినా, ఎండలు తగ్గటం లేదు. మధురవాడ నుండి పాత పోస్టాఫీసు వెళ్లే ఇరవై ఐదో నంబరు సిటీ బస్సు ఆ సెంటరులో ఆగటంతో దిగిన గురమ్మ, బస్సు లోంచి ఎవరో అందించిన తన పెండలం దుంపల గంపని మరొకరి సహాయంతో తల మీద కెత్తుకొని, జగదంబ సినిమా హాలు ముందున్న బస్ స్టాపు ఎడం వక్కన తను రోజూ కూర్చుండే చోటికి వచ్చి చేరింది.

ఆశీలుమెట్ట, మద్దిలపాలెం, జాల వైపు వెళ్లే జనం అటుకేసి వెళ్లాల్సిన బస్సుల కోసం నిరీక్షిస్తూ అక్కడక్కడే తచ్చాడుతున్నారు.

"కుసింత సెయ్యెయ్యి బాబా!" తనకు దగ్గర్లో నిల్చున్నతన్ని అడిగింది గురమ్మ. తన తలపై వున్న పెండలం దుంపల గంపని కిందకి దించమన్నట్లు కళ్లతో చెబుతూ. ఆమె మాటల్లో ఎక్కడా మెత్తదనం గానీ, సహాయం చేయమని అర్థించినట్లు గానీ లేదు. అతడో మారు గురమ్మ కేసి ఎగాదిగా చూసి, అనిష్టంగానే తన రెండు చేతుల్తో గంప అంచుల్లో వట్టుకొని కిందకి దించేడు.

"నింపాదిగా... నింపాదిగా... దుంపలు ఉత్తి పుణ్నేనికి ముక్కలైపోగలవు" అంటూ విసుక్కుంది,

'గంప దించినందుకు మెచ్చుకోవటం మాట అటుంచి పై నుండి ఈ చిరాకొకటీనా?' అతడు గురమ్మ కేసి గుర్రుగా చూసి, కాస్త దూరంగా వెళ్లి నిలుచున్నాడు.

దుంపల గంప మీద మడత పెట్టి వుంచిన ప్లాస్టిక్ కవర్నీ, పాతబడ్డ కొద్దిపాటి చిరుగుల దువ్పటినీ తీసి, ఒక సారి దులిపింది.

ముందుగా ప్లాస్టిక్ కవర్ని పరిచింది. ఆ తరవాత దువ్పటిని నాలుగు మడతలు చేసి, డబ్బుల్ని దాయడానికి వీలుగా పొరలున్న వైపు తన ముందుకు వచ్చేట్టుగా వేసుకొంది.

గంప లోంచి కత్తిపీట తీసి వక్కనుంచింది. దుంపల ఆకారాన్ని బట్టి, చిన్నవీ, పెద్దవీ వేరు చేసింది. వాటిని విడివిడిగా వుంచి కుప్పలుగా కొన్నింటిని పెట్టి, ఎంత రేటుకి అమ్మాలో నిర్ణయించుకొంది.

అమ్మకానికి ఉపక్రమించే ముందే అన్నీ సర్దుబాటుగా వున్నాయో, లేదో ఒక సారి చూసుకొని, గట్టిగా ఊపిరి పీల్చి వదిలింది.

తన చుట్టూ బస్సుల కోసం వడిగాపులు కాసే జనాలకేసి చూసి నిట్టూర్చింది. ఎండకి ఒళ్లు సర్రుమనటంతో పాటుగా, అభిషేకం చేయించుకున్నట్టు చెమట కారటంతో తను రోజూ సాయంకాలం ఇంటికి వెళ్లేప్పుడు దగ్గరలో వున్న తడకల హోటల్లో దాచేసి వెళ్లే తాటాకుల గొడుగు గుర్తొచ్చింది.

వెళ్లి గొడుగు తెచ్చుకోవాలనుకుంది... అయితే దుంపల్ని వదిలేసి వెళితే కుక్కలు, పందులు వచ్చి కలబడిపోతాయని ఆలోచించి, ఓ సారి హోటల్‌కేసి చూసింది. ఎందుకో గానీ... అదే సమయంలో హోటల్ యజమాని అప్పల్నాయుడు గురమ్మకేసి చూశాడు.

"ఓరప్పల్నాయుడా! మీ సన్నాసిని గొడుగొట్టుకు పొర్రమ్మనవా...!"

ఆ కేకకి హోటల్‌లో టిఫిన్లు చేస్తున్న కస్టమర్లు ఒకరిద్దరు గురమ్మకేసి చూసేరు.

"ముసిలిముండ, వచ్చిందగ్గర్నుండీ... కాల్చుకు తింటాది!" లోలోపల తిట్టుకుంటూ ఎంగిలి ప్లేట్లు ఎత్తుతున్న సన్నాసిని కేకేసేడు. "ఒరేయ్ సన్నాసీ! గురమ్మ గొడుగొట్టికెళ్లిచ్చిసి, బేగొచ్చెయ్!" అని వాడికి ఆ పని పురమాయించి తన పనలో మునిగిపోయేడు.

సన్నాసి తెచ్చిన గొడుగుని అక్కడున్న కన్నంలోకి పాతింది. హోటల్‌కేసి వెళ్లిపోతున్నవాణ్ని ఆగమని కేకేసి, తన కొంగున ముడేసుకున్న చిల్లర డబ్బుల్ని తీసింది. "ఇంద, పావలా ఒట్టికెళ్లి బడ్డీ కొట్టు కాడ సుట్టముక్కొట్టుకు పొర్రమ్మీ" కొంగు ముడి విప్పుతుండగా... ఆశగా తనకు డబ్బులిస్తాదని అనుకున్న సన్నాసి, సుట్ట ముక్క తెమ్మనడంతో మళ్లీ గిరుక్కున వెనక్కి తిరిగేడు.

"మా అప్పల్నాయుడు గోరు కోప్పడతారు. ఎంగిలి పేట్లు ఎత్తకండా ఎల్పోనానని సిరాకు వడ్తారు... నానెల్ను" హోటల్‌కేసి పరిగెత్తేడు సన్నాసి.

"ముండెదవా!" పైకే తిట్టింది.

నడుంకి చుట్టుకున్న చీర చెంగును రెండు చేతుల్తో ఒక సారి దులిపి, అలాగే మొహమూ, మెడా తుడుచుకొని, గొడుగు కిందకు దూరి సర్దుకొని కూర్చుంది.

'ఎప్పుడో తెల్లవారు జామున కాల్చిన సుట్ట. నాలుక పీకేత్తం'దని అనుకుంది. తాత్కాలికంగా సుట్ట తాగాలన్న కోరికను చంపేసుకుంది.

స్టాపులోకి అప్పుడప్పుడూ సిటీ బస్సులు వచ్చి, ఆగి, వెళ్తున్నాయి. గురమ్మకి ఆ వాతావరణం కొత్త గాదు. తన పెళ్లయిన కొత్తలో మొదలెట్టిన వ్యాపారం ఇది. దాదాపుగా నలభై సంవత్సరాలుగా అదే సెంటర్లో దుంప లమ్ముతోంది.

కాలచక్రంలో ఎల్లమ్మ తోట ఎలా జగదాంబ జంక్షనుగా మారిపోయిందో గుర్తొచ్చింది. 'కొత్త నీరొచ్చి పాత నీటిని పారదోలినట్టు, హోటల్లు, సినిమా టాకీసులు, కొత్త కాలనీలూ హటాత్తుగా పుట్టుకొచ్చి తరాల్నుండి వున్న ఆ ప్రాంతాల పేర్లను మరుగున పడేస్తున్నా'యనుకుంది.

గురమ్మకి మానవసంబంధాల వట్ల కూడా ఒక రకమైన చులకన భావమే! లోకం డబ్బు చుట్టూ తిరుగుతూ, ప్రేమలకీ, ఆత్మీయతలకీ అతీతం అయిపోయిందని ఏ నాడో నిర్ణయం చేసుకుంది గనక, దానికి తగ్గట్టుగానే జీవనం సాగిస్తోంది.

విజయనగరం నుండి విశాఖపట్నానికి కాపురానికి వచ్చినప్పుడు గురమ్మకి పదహారేళ్ల వయసు. మొగుడు అతిమంచితనంతో సత్తికాలం మనిషి అవటంతో, అత్త, ఈ దుంపల వ్యాపారంలోని మెలకువలన్నీ గురమ్మకి నేర్పించింది. ఎండాడ, తాళ్లవలస, అనంతపురం లాంటి వల్లెల్లోకి వెళ్లి, వచ్చి పెండలం దుంపల్ని కొని, ఉడకేసి, వాటిని ఎలా లాభసాటిగా అమ్మాలో చెప్పింది.

స్మైల్ గారి 'ఖాళీ సీసాలు' కథ ఎంత గొప్పదో అందరికీ తెలిసిందే! అందులోని నూకాలమ్మ, తన అంతర్మథనంలో ఇలా విలపిస్తుంది-"గుంటడూ, గుంటదీ ఏ బస్సుల్కాడో అడుక్కుంటూవుంటారు. అది పాడుర్ది, ఆడు చెక్కల్కాడతాడు. ఆడుకోవలిసిన వయసులో పాడు పిల్లలు అడుక్కుంటున్నారు బాబూ!"

ఈ కథ విశాఖపట్నంలోని కేజీ హాస్పిటల్ గేటు ముందు జరుగుతుంది. ఆ పిల్లలిద్దరూ అక్కడికి దగ్గర్లో వున్న జగదంబ సెంటర్‌లో బస్సుల ముందు అడుక్కుంటున్న దృశ్యాన్ని చూస్తున్నట్లు అనిపించింది. ఆ పిల్లల చుట్టూ కథ అల్లాలనే ఊహ కలిగింది. ఆ తర్వాత అప్పుడప్పుడూ విశాఖపట్నం వెళ్తుండేవాణ్ని. అక్కడ మార్కెట్లలో దుంపలూ, చేపలూ, కూరగాయలూ, పండ్లూ అమ్మేవాళ్లు ఎంత నిర్లక్ష్యంగా, దర్జాగా, రావిశాస్త్రి సారాకథల్లోని పాత్రల్లా, రఫ్‌గా ప్రవర్తించడం చూసేను. మా అమ్మమ్మ కూడా ఆ ఊళ్లోనే వుండేది. ఆమె కూడా కరకుగానే జీవించేది. వాళ్లు ఎందుకలా గయ్యాళుల్లా ప్రవర్తిస్తారో... తెలుసుకుంటే వెనక చాలా విషాదచరిత్ర వుంటుంది. ఈ సెంటర్ని జగదంబ అనే ఉచ్చరించాల్సి వున్నా, వ్యవహారంలో జగదాంబ అని వుండటం వల్ల దాన్ని అలాగే వుంచేసేను.

గురమ్మ పాత్రలో మా అమ్మమ్మనూ, రాజు, చిట్టి పాత్రల్లో స్మైల్ గారి ఆ 'పాడు పిల్లల్నీ' ప్రతిక్షేపించుకొని కథ రాసేను. ఈ కథ సుప్రభాతంలో వచ్చినప్పుడు అప్పటి ఎడిటర్ శ్రీ వాసుదేవరావు గారు "ఒళ్లు దగ్గరుంచుకొని కథ రాశావయ్యా" అంటూ అభినందించేరు. చంద్ర గారితో ప్రత్యేకంగా బొమ్మ వేయించేరు.

ఈ కథ చదివి మధురాంతకం రాజారాం గారు, నరేంద్ర 'నాలుగు కాళ్ల మండపం'తో పోలుస్తూ ఒక ఏకాంకికలా వుందంటూ ఉత్తరం రాసేరు. ఆ మధ్య అల్లాడి ఉమ, ఎమ్. శ్రీధర్ గార్లు ఇంగ్లీష్‌లోకి అనువదించగా, ఈ మధ్యనే ద యూనివర్సిటీ ఆఫ్ టెక్సస్ అట్ ఆస్టిన్ నుంచి వెలువడిన ఎ సౌత్ ఏషియా గ్రాడ్యుయేట్ రీసెర్చ్ జర్నల్ వాల్. 8, 2002లో జగదాంబ జంక్షన్ ప్రచురించేరు.


-రచయిత

గురమ్మకి కొడుకు, కూతురూ పుట్టేక కొంత కాలానికి, ఆర్నెల్ల తేడాలో అనుకోని జబ్బులు చేసి, అత్తా, మొగుడూ చనిపోవటంతో, ఇంటి బాధ్యతనంతా తనే తీసుకొంది.

పెండలం దుంపల అమ్మకంలోనే తన కొడుక్కీ, కూతురికీ పెళ్లిళ్లు చేసింది. కొడుక్కి తన మేనకోడల్ని చేసి, కూతుర్ని తగరపువలసకి ఇచ్చింది. ఇప్పుడు తనకున్న బాధంతా ఒక్కటే!

గురమ్మ కొడుకు తాగుబోతు. వాడు చేసుకున్న కూలి డబ్బులన్నీ తాగుడుకే ఖర్చు పెడతాడు. అలాగని వాడి మానాన వాణ్ని వదిలేస్తే తండ్రి బాటలోనే జులాయిగా తిరిగే మనవడు తయారయ్యేడు. పదహారేళ్లయినా సరిగా నిండనివాడు. తోటి పోరంబోకు సావాసగాళ్లతో సినిమా హాళ్లెంటా, బ్రాకెట్ల వెంటా తిరుగుతాడు. కోడలు మధురవాడ బస్ స్టాండులో ఆగిన బస్సుల చుట్టూ తిరుగుతూ అరటిపళ్లు అమ్ముతాది.

తనూ, కోడలూ, ఇలా రెక్కలు ముక్కలు చేసుకొని కష్టపడి సంపాదిస్తూంటే తిని, కొవ్వెక్కి తిరగబడే కొడుకునీ, మనవణ్నీ భరించక తప్పటం లేదు.



చనిపోయిన మొగుడంటే గురమ్మకి దేవుడితో సమానం. అంత మంచి మనిషికి వారసులుగా ఈ బేవర్సుగాళ్లు ఎలా పుట్టారా? అని దిగులు వడ్డా... తన మొగుడి వంశాంకురాలు గనక, ఆయన రక్తమే వీళ్లలోనూ పారుతుందని తనకు తాను సర్ది చెప్పుకుంటుంది గురమ్మ.

వయసు అరవైకి పరుగులు తీస్తున్నా... అప్పుడప్పుడే ముడతలడుతున్న చర్మంతో, నలుపు చాయలో, సన్నగా రివటలా వుండి నడుం వంచకుండా నడుస్తాది గురమ్మ. అక్కడక్కడా నెరిసిన జుట్టుకి ఆముదం దట్టించి, కుడి వక్కగా కొప్పు కడుతుంది. చెవులకి కాడలు, ముక్కుకి బులాకీ తనకున్న బంగారు నగలు. పెళ్లికి ముందు నుండీ ఆ నగలు ఆయా అవయవాల్లో నెలవై వున్నాయి. రవిక వేసుకోటం తనకెప్పుడూ అలవాటు లేదు. కుడి వైపుగా కొంగేసుకోవటం అలవాటైన గురమ్మ ఎప్పుడూ ముతకచీరలు తప్పించి, మరో రకం ఎరగదు.

జగదాంబ జంక్షనులో పొద్దు ఎక్కే కొద్దీ వాహనాల సందడి మరింతెక్కువైంది. ఒక వక్క దుంపల్ని అమ్ముతూనే పరిసరాల్ని పరికిస్తోంది. మార్నింగు షో సినిమాలకి వేళైంది. సిటీ బస్సులు ఆగటంతో గెంతి, చిత్రాలయ హాలుకేసి పరిగెత్తే ఆడవాళ్లని చూసి ఓర్వలేకపోయింది గురమ్మ.

"మొగుళ్లు అదంటందంట పనుల్లో కెళ్లిపోగానె టింగురంగని సోకులు సేసీసుకుని, దొంగసాటుగ సినీమాలకి ఎల్లొస్తుంటాయి ముండపావలు, ఒళ్లొలసకండా ఇంట్లో కూకుడోబెట్టి, తిండెట్టే మొగుళ్లు వుండబట్టి గొవ్వగా సుకవడిపోతన్నారు" అని మనసులో కసిగా తిట్టుకుంది.

బస్సులు, ఆటోలు వెర్రెక్కిన ఆంబోతుల్లా అప్సరా 'డౌను' నుండి పూర్ణా మార్కెట్ వైపూ, కేజీ ఆస్పత్రి 'అప్పు' వైపూ పరుగులు తీస్తున్నాయి. గురమ్మకి కొద్ది ఎడంగా వున్న ఆటో స్టాండులో బేరాలు కట్టకుండా రాత్రి చూసిన సినిమా గురించో, బస్టాండులో నిల్చున్న కాలేజీ పిల్లల గురించో, దేశరాజకీయాల గురించో తెగ చర్చించుకుంటూ ముచ్చట్లాడుకుంటున్నారు ఆటో డ్రైవర్లు. ఏ పాసింజరైనా వచ్చి "మీటరు మీద ఫలానా దగ్గరకి వస్తావా?" అనడిగితే, "ఏటీ... మీటర్రేటుకి రమ్మంతావా? చినవాల్తేరు పిచ్చాసుపత్రి నుండి కాని పారిపోయి వచ్చావా?" అని ఎగతాళి చేస్తున్నారు కొందరు డ్రైవర్లు.

జగదంబ హాలుకు ఎదురుగా వున్న దండు బజార్ రోడ్డు మీద బలిసిపోయి వున్న పందులు కొన్ని వీరవిహారం చేస్తూ వాహనాలు నడిపించే డ్రైవర్లని ఆట పట్టిస్తున్నాయి.

లీలామహలుకి వెళ్లే డౌను రోడ్డు కిరువక్కలా వున్న ఫుట్ పాత్‌లపై చిల్లర సామాను అమ్మే జనం నిండిపోయి వున్నారు. జంక్షను చుట్టూతా వున్న పెద్ద పెద్ద బట్టల షాపులు, బేకరీలు, హోటళ్లు, చెప్పుల దుకాణాలు, వీడియోలు-ఆడియోలతో వెలసిన కొత్త కొత్త షాపుల్లోంచి హోరెత్తించే సంగీతధ్వనుల్తో... జాతరలా వుంది అక్కడంతా.

బస్సులకి వేలాడుతూ ప్రయాణించే జనంకేసి చూసిన గురమ్మ, 'మాయమంద, పాపం పెరిగినట్లు పెరిగిపోతోం'దని మనసులో అనుకుంది.

రోజూ గురమ్మని చూసే కొందరు చనువుగా వచ్చి, "బామ్మా! బాప్పా!" లాంటి వరసల్ని

## సామెతను నిజం చేసింది!

చదువుకూ, వయసుకూ సంబంధం లేదంటారు. దాన్ని నూటికి నూరు పాళ్లూ నిజమని రుజువు చేసిందో వృద్ధమహిళ. 95 ఏళ్ల వయసులోని చాంగ్ తీయన్ చున్-తైవాన్ నివాసి. తన మునిమనవరాలు చదువుకుంటుంటే, తనకు చదువు రానందుకు నామోషీగా ఫీలైందట. ఆ బాలిక తనకు ప్రేరణ కాగా, వెంటనే ప్రాథమికవిద్యాశాలలో చేరి, చదువుకుని, పరీక్షలో ఉత్తీర్ణురాలైంది. చదువుకోవాలనుకోవటం వేరు, దాన్ని ఆచరణలో పెట్టటం వేరూను. కానీ చున్ మాత్రం జీవితచరమాంకంలో చదువుకుని తక్కిన వృద్ధురాళ్లకు స్ఫూర్తిగానూ, ఆదర్శంగానూ నిలిచిందని చెప్పక తప్పదు.

ఎన్.

కలిపి సంబోధిస్తూ దుంపల్ని కొనుక్కెళ్తున్నారు.

డబ్బులకి తగ్గట్టుగానే దుంపని అమ్మటం జరిగేది. పెద్ద పెద్ద దుంపల్ని ఒడుపుగా పిడికిట్లో బిగించి, దళసరిగా గుండ్రని బిళ్లలుగా కోసేది కత్తిపీటతో.

"మరీ బంగారంలా అమ్ముతున్నావే?" అనెవరైనా వెటకారంగా అన్నారని అర్థం చేసుకుంటే... కోసిన దుంపనైనా గంపలోకి కోపంగా విసిరేసి "నీదసలు కొనే ముఖం కాదులే!" అని కసురుతుంది.

ప్రతి అమ్మే దుంప వెనకా తను పడుతున్న కష్టాన్ని గుర్తుకు తెచ్చుకునేది. మాటంటే పడే రకం కాదు గురమ్మ. ఎప్పుడూ తన పంతం నెగ్గాలనే తత్వం. దానికి తోడు మాట తీరు కరుగ్గా వుండటంతో, గురమ్మని ఎరిగినవారు చాలామంది చాటుగా "ముసల్దానికి సెడ్డ పొగరు!" అనటం మామూలే! మరొకరికి భయపడకుండా, ఎవర్నీ నమ్మకుండా జీవించటం మాత్రమే గురమ్మకి తెలుసు.

"గురమ్మా, వొప్పుడొచ్చినావు బొట్టే?" అంటూ వచ్చింది నూకాలమ్మ.

నూకాలమ్మది పూర్ణా మార్కెట్‌లో కూరగాయల వ్యాపారం. గురమ్మకి నేస్తురాలు. తన కోడల్ని కొట్లో కూర్చొబెట్టి అప్పుడప్పుడూ జగదంబ జంక్షను దగ్గరకు వచ్చి గురమ్మతో కొంతసేపు కబుర్లాడి వెళ్తుంది.

ఆగిన సిటీ బస్సు లోంచి స్టూడెంట్ కుర్రాడెవరో స్టాండ్‌లో నిల్చున్న పల్లెటూరి మనిషిని ఏదో అని ఆటపట్టించడం చూసిన గురమ్మకు కోపం వచ్చింది. 'వాడి పీక మీద కాలు మోపి ఒళ్లు చీరేయాలి' అనుకుంది.

"నూసేవే నూకాలమ్మా, ఆ యెదవల పొగరు? పోయిన శనోరం ఏటైనాదో ఎరికా? తగరపలస నుండి మా అమ్మిగోరి మావ... అదేనే మా ఈరకోడు అప్పన్న, ఆడికి ఒంట్లో బాగునేక కేజీలోని నూపించుకోడానికొచ్చి ఇటుకాసొచ్చినాడు. మాఁవిద్దరిఁవీ మంచీ, సెడ్డా ఊసులాడుకుంతన్నామా, ఇలాగే ఆగిన బస్సులో నుండి ఆ ఎదవసచ్చిన టూడెంటు మా ఈరకోణ్ని అదేదో పేరెట్టి పిలిసి, 'నీ నుట్టం నూరుగోడు రమ్మంతన్నాడు' అన్నాడు. ఈడెర్రి మొగఁవేసుకొని 'ఏ నూరిగోడు బాబా?' అంటూ లేసెల్నాడు. నూరిగోడూ నేడు, సుట్ట ముక్కా నేదు. సెడ్డ ఇరగబాటు. అమ్మా, అయ్యా పీకల్దాకా మేపేసి, కాలేజీల కంపతన్నారు గందా... ఈల్లేనేటి అల్లా ఆడ మందా అల్గే వున్నారు. సిగ్గూ సెరం వొగ్గేసి ఇకఇకలూ, పకపకలూనీ... కాలం ఎలగున్నాదో నూడోలమ్మా!"

"ఓ...లాల్తో నీకేటిదే... ఆళ్ల మానాన ఆళ్లే పోతారు. నాకయ్యన్నీ ఎందుగ్గానీ, నీ దగ్గర సుట్ట ముక్కుంటే ఇద్దూ..."

నూకాలమ్మ మాటలకి చేతులూ, మూతీ తిప్పింది గురమ్మ. "అబ్బే, నేదు. నానొచ్చిం దగ్గర్నుంచీ కాల్చనేదు. నాలికి పీకేత్తంది. అల్లా బడ్డీ కొట్టు కాడ కెల్లి రెండు సుట్లొట్రామ్మా!" అడిగినందుకు తనకే పని చెప్పిన గురమ్మకేసి మూతి బిగించి చూసి, మెల్లగా లేచి వెళ్లి సుట్టలు తెచ్చింది.

అగ్గి పుల్ల వెలిగించి ఒకేసారి ఇద్దరూ కాల్చుకున్నారు. కొద్ది సేపు కబుర్లాడి నూకాలమ్మ వెళ్లిపోయింది. సగం దాకా కాల్చిన సుట్టముక్కని నోట్లోంచి తీసి, మెడ పక్కకి తిప్పి తుప్పుమని ఊసి, తిరిగి అడ్డ పొగ పెట్టేసింది గురమ్మ.

సూర్యుడు నడినెత్తి పైకి వచ్చేడు.

మనుషుల మరుగుజ్జు నీడలకేసి పాలోచనగా చూస్తున్న గురమ్మకి చెక్కలు కొడుతున్న శబ్దం వినిపించి, తాటాకుల గొడుగు లోంచి తలని బయటికి పెట్టి, ముఖానికి ఎండ తగలకుండా మోచేయి అడ్డుగా వుంచుకొని, కళ్లు చిట్లించి చూసింది.

ఆగిన సిటీ బస్సు దగ్గరగా... ఓ ఎనిమిదేళ్ల కుర్రాడు చెక్కలు కొడుతుండగా, పదకొండేళ్ల అమ్మాయి గాల్లోకి చేతుల్ని తిప్పుతూ డాన్స్ చేస్తూ పాట పాడుతోంది.

"మాయమంద! అడుక్కు తినే జనం ఎక్కువైపోనాది నోకం నోని!" అని చిరాకు పడుతూ పిల్లలిద్దరి కేసీ తేరిపార చూసింది. పిల్లలిద్దరూ తన కేసి వస్తున్నారు.

చింపిరి జుత్తుతో పాదాల దాకా జీరాడే పాతబడ్డ ఎర్రని చిరుగుల పరికిణీ మీద, మాసిన చొక్కా ఒకటి వేసుకుని వున్న ఆ పిల్ల నల్లగా వున్నా ముఖంలో కళ వుంది.

కుర్రాడు ఎర్రగా బొద్దుగా వుండి ఏ ధనవంతుడి కొడుకో బిచ్చగాడిలా ఫాన్సీ డ్రెస్ వేసుకున్నట్లున్నాడు. ఆపిల్ పండు బుగ్గల్తో రింగులు తిరిగిన వెంట్రుకల్తో పెద్ద పెద్ద కళ్లతో వాడూ చిరిగిన చొక్కా, నిక్కరూ వేసుకొనివున్నా, చూడ్డానికి ముద్దొచ్చేలా వున్నాడు.

గురమ్మని చూడగానే వాడి చేతులు చెక్కల్ని బాదటం మొదలెట్టాయి. ఆ పిల్ల పాట మొదలెట్టి డాన్స్ చేయసాగింది.

"బంగారు కోడి పెట్టా వచ్చెనండీ"

"హే పాప హే పాప... హే పాపా"

గురమ్మ వాళ్లకేసి అసహనంగా చూస్తూ, కుక్కల్నీ, పందుల్నీ దూరంగా తగిలేయడానికి దగ్గరుంచుకున్న కర్ర తీసి చూయించింది. "ముందా పాట ఆపుతావా, తాపులు తింతావా?" గట్టిగా కసిరింది.

పిల్లలిద్దరూ గురమ్మ గొంతుకి భయపడి, బిగుసుకుపోయినట్లు ఆపేశారు. ఎందుకైనా మంచిదని కొద్ది దూరంలో వుండి డబ్బులడుక్కోడం మొదలెట్టారు.

కుర్రాడు మాటిమాటికీ దుంపల కేసి దొంగ చూపులు చూస్తూ ఆ పిల్ల పాటకి అనుగుణంగా చెక్కలాడిస్తున్నాడు.

గురమ్మ గంపలోని పెండలం దుంపలు సగం దాకా అమ్ముడయ్యాయి. డబ్బుల్ని జాగ్రత్తగా తను కూర్చున్న దుప్పటి మడతల్లో వుంచింది.

పిల్లలిద్దరూ ఎందుకో గానీ గొడవ పడ్తున్నారు. వాడు మారాం చేస్తుంటే, ఆ పిల్ల బుజ్జగిస్తోంది.

"అల్లక్కడ సూడూ! ఎన్ని రంగుల్లో రంగు బుడ్లున్నాయో, ఒక్కటి కొనియ్యి" వాడు దగ్గర్లో వున్న కూల్ డ్రింక్ షాపుకేసి చూయిస్తూ అన్నాడు.

"అమ్మకి వొంటో బాగునేదని తెల్దేటి? అమ్మేటి సెప్పిందోరే! మందులు కొన్నందకి డబ్బులు సాలవన్నాదా, ఆసుపత్రికి అమ్మని తీసుకెళ్లమని డాటేరు బాబు సెప్పనేదేటి? నీకు

అమ్మ కావాలా, రంగు బుడ్డీ కావాలా?" వాణ్ని ఒప్పించడానికి బతిమాలుతోంది.

"అమ్మ కావాలిగానీ, ముందు రంగు బుడ్డీ కొనీయ్!"

"రంగు బుడ్డీ పావలా అనుకున్నావేట్రా కొండానికి? కావాలంటే సోడా కొనిత్తాను" తెగేసి చెప్పింది.

పిల్లల సంభాషణ వింటున్న గురమ్మకి వాళ్ల ఆరా తీయాలనిపించింది. "ఒలే గుంటా, ఇల్రాయే! ఎందుకో వల్లక దెబ్బలాడీసుకుంతన్నారూ?"

గురమ్మ పిలుపుతో కొద్దిగా బెదురుతూనే వచ్చారిద్దరూ.

"ఈడ్నీకు ఏటౌతాడే?"

"అడ్నా తమ్ముడే బామ్మా! సెడ్డ పేసీకోరు. మాఁవు అడుక్కునీ డబ్బులెట్టి రంగు బుడ్డీ కొనీసుకుందామంతన్నాడు."

ఆ పిల్ల మాటలకు గురమ్మ ఆశ్చర్యపోయింది. "ఈడ్నీకు తమ్ముడేటీ, వల్లకోయే! మాడిపోయిన కవాపుల్లనాగ నీవున్నావు, పండిన మాఁవిడి పొండు నాగాడున్నాడు."

"నేదు బామ్మా! నత్తిపెమానంగా అడ్నా తమ్ముడే. అడి పేరు రాజు. నా పేరు సిట్టి."

"మీ అమ్మేటి సేత్తాదే?"

"ఏటీ సెయ్యదు. ఇంట్లోని ఒళ్లకే వుంతాది."

"మీరడుక్కొల్లిన డబ్బులు సాలతాయేటే, మీ అయ్యేటి సెయ్యడా?"

"మా కయ్యి నేడు. రాజారావూ, నూకరాజు, సిఁవాసెలఁవూ... అల్లంతా ఒచ్చి డబ్బులిచ్చీవోరు ఇన్నాళ్లూనీ. మా అమ్మకి జబ్బు సేసిని కాడ్నుండీ అఁళ్లాటం మానీసేరు."

"మీ ఇల్లు ఎక్కడే?" అనుమానంగా నూసింది గురమ్మ.

"సావులు మదుం దగ్గిరే, పాకిల్లు."

ఆ పిల్ల మాటల్ని బట్టి తనకంతా అర్థం అయిపోయినట్లు తలని కిందకీ, పైకీ ఆడించింది. 'అమ్మో గుడిసేటి ముండా! నీ తల్లి రంకు దాయా? ఒపుడొపుడి దగ్గిర తొంగోని మిమ్మల్ని కని పారీసిందో, వుప్పుడు రోగాల్తెచ్చీసుకున్నాది గావాలా! ఇందంట అడుక్కోని రండని తోలీసినాది గావాల మిమ్మల్ని' మనసులో అనుకోకుండా వుండలేకపోయింది గురమ్మ.

మధ్యాహ్నం రెండు గంటలు కావస్తోంది. మార్నింగ్ షో వదిలినట్టు గుర్తించింది గురమ్మ, జనప్రవాహాన్ని చూసి. మాట్నీ ఆట మొదలయ్యాక జంక్షన్‌లో కొంత సందడి సద్దు మణిగింది.

అప్పటి దాకా పని చేయని ట్రాఫిక్ లైట్లు అకస్మాత్తుగా వెలగటంతో కొంత సేదదీరొచ్చని అనుకున్న పోలీసు, జగదంబ హాలు నీడలోకి వచ్చి చేరేడు.

పోలీసుని చూడగానే దుంపల మీద గుడ్డ కప్పేసింది గురమ్మ. "తొత్తుకొడుక్కి దుంపని తీసీసుకుని నోట్లోకి కుక్కీసుకోడఁవే తెలుసు గానీ, జేబు లోంచి దమ్మిడీ తీయడు." ఎప్పుడో జరిగిన సంఘటన గుర్తుకి తెచ్చుకుంది.

ఎండ వేడికి ఒళ్లు కమిలిపోయినట్లు అనిపించింది. ఆకలి కూడా వేస్తున్నట్లు అనిపించింది. ఇంట్లోంచి తెల్లవారు జామున బయల్దేరినపుడు తిన్న సల్దన్నము. మళ్లీ రాత్రికే తిండి. మధ్యాహ్నం టిపిన్లు కూడా తినదు. టీ మాత్రం తెప్పించుకు తాగటం అలవాటు.

అడుక్కుంటున్న రాజుని రమ్మని చేత్తో సైగ చేసింది. దుంపేమైనా ఇస్తుందన్న ఆశతో పరిగెత్తుకుని వచ్చేడు వాడు.

"ఒరేయ్, అల్లా ఒటేల్లోకి యెల్లి దుంపల గురమ్మంపిందనిసెప్పి, టీ పట్రమ్మీ!" రాజు తెచ్చిన టీ తాగేసి, ఎంగిలి గ్లాసుని తిరిగి హోటల్‌లో ఇచ్చేసి రమ్మంది.

మళ్లీ వచ్చిన రాజు, గురమ్మ దుంపేమైనా తీసుకోమంటాదని అక్కడే తచ్చాడాడు. దుంప ఊసు ఎత్తనట్టు తన బేరం చూసుకుంటూ, అప్పుడప్పుడూ డబ్బుల్ని లెక్కబెట్టుకుంటోంది.

మరిక లాభం లేదనుకున్న రాజు, గురమ్మకేసి కోపంగా చూస్తూ అక్క దగ్గరకెళ్లిపోయాడు. 'ఎండకి వొళ్లు పేలిపోతోం'దని చిరాకు పడ్తూ అందినంత మేర వీపు గోక్కోడానికి ప్రయత్నిస్తున్న గురమ్మకి సిట్టి కన్పించడంతో కేకేసింది.

"ఒలేయ్ సిట్టి గుంటా, బీపు బకుర్దువు గాని రాయే!" గురమ్మ చెప్పిందే తడవుగా వెనక వైపుగా వచ్చి మోకాళ్ల మీద కూర్చుని తన వాడిగోళ్లతో మెడ దగ్గర నుంచి నడుం దాకా మెల్లగా గోకసాగింది. అక్కడక్కడున్న చెమట పొక్కుల్ని చిదిమింది.

సిట్టి చేత వీపు గోకించుకోవటంలో చాలా హాయిగా అనిపించింది. తన కొప్పును విడదీసి కొద్ది సేపు పేలు చూడమంది. సిట్టి చేతులు తల్లో ఆడుతోంటే నిద్ర కమ్ముకొస్తున్నట్లుగా వుంది.

"అవునే గుంటా... అయ్యేం పాడు పాటలే?" మాటల్లో సిట్టిని అక్కడే వుంచేసి, మరి కొంత సుఖం పొందాలనుకుంది గురమ్మ.

"నీకు తెల్దేటి బామ్మా? సిరంజీవి పాటది. సినిమా నీవు నూన్నేదేటి?"

"ఓ బోడిగోడి పాటైతే నాకేటే? దేవుడి పాట్లావేటి?"

"అలాటియి పాడితే జనం డబ్బులేయిరని సెప్పింది మాయమ్మ."

## స్థూలకాయుల మీద గర్భనిరోధకమాత్రల ప్రభావం వుండదు

మహిళల బరువు 155 పౌండ్ల కన్నా ఎక్కువుంటే అలాంటి వారి మీద గర్భనిరోధకమాత్రల ప్రభావం తక్కువగా పడుతుందట. అంటే గర్భనిరోధానికి మాత్రలు సేవించినప్పటికీ, వాటి ప్రభావం తక్కువ కావటం వల్ల, గర్భధారణకు అవకాశాలున్నాయంటున్నారు వైద్యబృందాలు. ఈ మాత్రలలోని హార్మోన్లు గర్భం రాకుండా ఆపుతాయి. కానీ లావుపాటి మహిళల శరీరంలోని ఫాట్, హార్మోన్లను శోషింపజేస్తుంది. అందువల్ల గర్భనిరోధకమాత్రలు వేసుకున్నా పని చెయ్యవు; కనుక స్థూలకాయులైన మహిళలు మాత్రలకు బదులుగా మరేదైనా మార్గం అవలంబించాలి.

ఎస్.



## డయెటింగ్‌తో హృదయరోగాలు...?

శరీరం బరువు పెరిగితే రక్తపుపోటు, హార్ట్ అటాక్ వస్తాయని అందరికీ తెలుసు. కానీ బరువు తగ్గేందుకు చేసే ప్రయత్నాల వల్ల కూడా హార్ట్ అటాక్ రావచ్చునట. శరీరం బరువు తగ్గించుకోవటం లేదా డయెటింగ్ చేయటం వల్ల గుండె కొట్టుకునే వేగం తగ్గిపోవటం, హృదయం పరిమాణం పెరగటం వంటి సమస్యలు కలుగుతాయంటున్నారు పరిశోధకులు. ఎక్కువ కాలం డయెటింగ్ చేయటం వల్ల రక్తపుపోటు తగ్గుతుంది. జీర్ణక్రియ కూడా నిదానమవుతుంది. అందుకని స్థూలకాయం తగ్గించుకోవటానికి ఎక్కువ కాలం డయెటింగ్ వద్దంటున్నారు వైద్యనిపుణులు. దానికి బదులుగా ఎక్సర్‌సైజులు చెయ్యమంటున్నారు.

ఎస్.



"ముండ పాటన్నేర్సినావునే!..." నవ్వింది గురమ్మ.

"నీకు పాడ్డ(వొచ్చేటి బామ్మా?" కుతూహలంగా అడిగింది సిట్టి.

"నా పాటింటే ఇరగబడి నవ్వుతావ్‌లే!"

సిట్టి గురమ్మని పాట పాడమని బలవంతపెట్టింది. 'తను పాడకపోతే గుంట ముండ అడుక్కోనంకి పారిపోద్ది గావాల' అనుకుంటూ తనకు గుర్తున్న పాటని అందుకుంది-

"చింతకాయ బొంతకాయ చిమిడి
మావిడికాయ,
కోనేటి వంకాయ కొమ్మ నిమ్మల పండు
జీలుగులు తోటలో ఓలుగులు మేయగా
ఒక్కటే రాలగా, వరిపువ్వు రాలగా
తోటాకు దబ్బనం కోట గట్టించీ,
తోటలో వున్నాయి జుమ్మ తేనిగలు
గట్టెక్కి చూస్తే గంజాయి గుర్రాలు
ఇంటింటికో బండి ఇనపగట్లా బండి
సిక్కావు తోటకీ ఒక్కటే గొలుసు
సీబొందు రామనా ఉయ్యాలో...
రామనా రచ్చ తూగుటుయ్యాలో..."

పాట పాడుతూ పాడుతూ తనలో తను నవ్వుకుంటూ ఆవలించింది.

గురమ్మ పాటని విన్న సిట్టికి అందులోని ఒక్క ముక్కయినా అర్థం అవలేదు.

ఇలాంటి పాటన్ని పాడితే మటుకు జనం పైసా కూడా వేయరని మాత్రం అనుకుంది.

మరో అరగంట దాకా ఇద్దరూ కబుర్లు చెప్పుకున్నారు. అప్పటి దాకా రాజు తన దగ్గరున్న చిల్లర డబ్బుల్తో ఏ బఠాణీలో కొనుక్కొని తింటూ అడుక్కుంటున్నాడు.

"ఒలేయ్ సిట్టీ! నాను ఒగటికెళ్లొత్తాను. సిటం ఇల్లిక్కడే కూకుడోయే! ముండెదవలు ఒగటికెళ్నిందకి ఇందంటెక్కడా కట్టనేదు. అల్లా దండు బజారు కానీ ఎళ్లొత్తాను. జాగర్త సుమీ! కుక్కనంజిలు ఏ ఇరక నుండో ఎల్పొచ్చీసి, దుంపలెత్తుకుపోతాయి. ఇదిగో, ఇల్లీ కర్రొట్టుక్కూకోయే!"

"అల్గే బామ్మా! నీవు బేగెల్లీసొచ్చీయ్. నాను దుంపల్దగ్గిరే వుంతాను."

సిట్టి మీద భరోసా వుంచింది గురమ్మ. విడిన కొప్పుని తిరిగి కట్టుకొని, మరోసారి జాగ్రత్తలు చెప్పి, "ఎవరైనా కొనడానికి వస్తే అమ్మకం చేయ"కని చెప్పింది.

గురమ్మ వెళ్లిపోగానే అక్క దగ్గరకి చేరిపోయాడు రాజు.

"సిట్టక్కా, సిన్న దుంపెట్టు."

"ముసిలిదాయ సూసినాదంటే సరమ్మొలిచ్చిగల్దొరేయ్!"

"అది వుప్పుడున్నాదేటి? ముసిలిఖండి నాను టీ తెచ్చినందకయినా సిన్న దుంపెట్టింది కాదూ.."

"నాకిచ్చినాదేటి? నానూ బీవు బకిర్నాను గానా? పేలూ సూసినాను. సిటంవొల్లకోరా! ఒగటి కెల్లీసొచ్చీక దుంపిత్తాది గానీ" తమ్మునికి సర్ది చెప్పింది.

మాటల్లోకి దింపేసి ఒక దుంపని సిట్టి కళ్లు గప్పేసి దాచేసేడు. ఏమీ తెలీనట్టు మెల్లగా ఆటో స్టాండుకేసి వెళ్లేడు.

దండు బజారు డౌను దిగుతుండగా జగదంబ కేసి వస్తున్న గురమ్మ డేగ కళ్లకి ఆటో చాటుగా దుంప తింటున్న రాజు కనిపించేడు.

కోపంతో గురమ్మ వడివడిగా వచ్చింది. వస్తూనే గాల్లోకి చేయి విసిరి సిట్టి సెంప మీద చెళ్లుమని జల్లేసింది, తన ఐదేళ్లూ అంటుకుపోయేలా.

ఊహించని దెబ్బకి తూలిపడబోయి నిలదొక్కుకుంది సిట్టి. ఒక్క క్షణం గురమ్మ తనని ఎందుకు కొట్టిందో అర్థం గాక కంగు తిన్నట్లుండిపోయింది. ఎగదన్నుకొచ్చిన ఏడుపుని దిగమింగింది. కళ్ల నిండా నీళ్లు నింపుకుంది.

"నంజిముండకానా! నీ తమ్ముడికి ఎన్ని దుంపలందించీసినావే?" సిట్టి రెక్క పట్టి లాగి, విసురుగా తోస్తూ అరిచింది.

"నానీయినేదు బామ్మా!" చిన్నగా వణికిపోతూ అంది సిట్టి.

"నీవీయికంటే దుంపల్లెగిసెల్లి నీ తమ్ముడి సేతుల్లోకి ఎల్పొయినాయేటీ?"

అప్పుడు చూసింది సిట్టి, తమ్ముడెక్కడున్నాడోనని. వాడు గురమ్మ సిట్టిని కొట్టడం చూస్తూనే దూరంగా పారిపోయి దొంగచాటుగా ఏం జరుగుతుందోనని చూస్తున్నాడు.

"అబద్ధాలకోరు ముండా! బీవు సీరీగల్ను. నీ యమ్మ రంకుమొగిడి సొమ్మనుకున్నావేటీ?" గురమ్మ అరుపులకి స్టాపులోని జనం మూగేరు.

బిక్కచచ్చినట్టు పాలిపోయిన మొహంతో అలాగే నిల్చుండిపోయింది సిట్టి.

"ఏడీ ఆ దొంగెదవ?" చుట్టూ పరికిస్తోంది గురమ్మ.

గురమ్మ చెంప దెబ్బ ఎంత గట్టిగా తగుల్తాదో తెలిసిన సిట్టి, తమ్ముణ్ని ఎంత బాదేస్తాదో అని భయపడిపోయింది."నాకు తెలకంట దుంప దాసీసినాడు. నీ మనవడ్లాటోడు. ఆన్ని ఒగ్గేయ్ బామ్మా!" బతిమిలాడుతున్నట్లుగా అంది సిట్టి.

"ఇంకో పాలి నా మనవడన్నావంతే తన్నీగల్ను యూర్లా! నాకాడు మనవడేటీ... ఆడెవుడికి పుట్నాడో? నా కొడుక్కి పుట్నాడేటే నంజిముండా? ఆడొంట్లో నీ వొంట్లో ఏ దిక్కుమాల్నెదవల రగతం పారతందో?" రెచ్చిపోయిన గురమ్మ సిట్టిని కొట్టినంత పని చేసింది.

ఇక లాభం లేదనుకొని అక్కడ్నుంచి జారుకుంది సిట్టి.

సాయంత్రం అవుతున్నకొద్దీ... నగరం చల్లబడసాగింది. చల్లటి సముద్రం గాలి వీస్తోంది.

జంక్షనులో మళ్లీ సందడి ఎక్కువ కాసాగింది. మరో ఇద్దరు ట్రాఫిక్ పోలీసులు వచ్చేరు. మెత్తని పకోడీలు, చేగోడీలు, జిలేబీలు అప్పటికప్పుడు చేసి వేడివేడిగా అమ్మే తోపుడుబండ్లు ఒక్కొక్కటే రాసాగేయి.

మేట్నీ సినిమాలు వదిలేసేరు. చెదిరిన పుట్ట లోంచి చెల్లాచెదురై పాక్కుంటూ పోతున్న చీమల్లా జనం, డ్యూటీల్నుండి ఇంటికి వెళ్లే జనం, షాపింగు చేయడానికి వచ్చిన జనం, సినిమాలకి వెళ్లే జనం... అంతా జనమయం.

సైకిళ్లు, స్కూటర్లు, హోండాల్లాంటి ద్విచక్రవాహనాలతో పాటు ఆటోల్లాంటి త్రిచక్రవాహనాలు... సిటీ బస్సుల స్వైరవిహారాలు... అన్నింటినీ కలగలిపి ధనులెగరగొట్టే హారన్ల మోతల్తో... జగదాంబ జంక్షనంతా గోలగోలగా, హోరుహోరుగా వుంది.

ఉదయం నుండీ దుంపలమ్మిన గురమ్మ నీరసించిపోయింది. ఇంక జత దుంపలు మిగిలిపోయేయి. వాటిని ఎవరైనా వచ్చి కొనగానే ఇంటికి వెళ్లిపోవాలనుకుంది.

హోటల్ కుర్రాడు సన్నాసిని కేకేసి రప్పించి, తన తాటాకుల గొడుగుని దాచేయమని చెప్పింది.

చీకట్లు ముసురుకుంటున్నాయి. జగదంబ జంక్షన్‌లో ఒక్కో మెర్క్యురీ లైటూ వెలగసాగింది.

అల్లంత దూరంలో తనకేసి వస్తున్న మనవడ్ని చూడగానే ముఖం చిట్లించుకుంది గురమ్మ. వాడి జులాయి వేషాన్ని ఎంత దూరం నుండైనా పోల్చగలదు.

చూస్తుండగానే దగ్గరగా వచ్చి, దర్జాగా నడుం మీద చేయి వేసుకొని కళ్ల మీద ఊగాడే జుత్తుని వెనక్కి సవరించుకున్నాడు.

"నాన్నమ్మా! నానర్జింటుగా సినిమా కెళ్లాల. అలంకారులోని సిరంజీవి సినిమా ఆడతన్నాది. దుంపలన్నీ అమ్మీసినావేటి? సినీమాకి బేగ డబ్బులిచ్చీయ్!"

"ముండ దర్జా! సినీమాకు డబ్బున్నేవు!" వాడి వైపు కోపంగా చూసింది.

"అల్ల సూత్తన్నవేటే ముసిల్దానా? సెవుల్లోకి నాన్సెప్పిందింకా దూర్నేదేటి? ఏసికాలెయ్యకంట బేగి డబ్బులిచ్చీయ్!" గురమ్మ కన్నా కోపంగా అరిచేడు.

"ఒరేయ్, తొత్తికొడకా! నీవూ, నీ బాబూ నా సొమ్ముకి దాపురించినార్రా! ఒక్క దమ్మిడీ ఈయను. పీకల్దాకా మేపతన్నాం కామా... అది సాల్దా? దుంపలమ్మి డబ్బుల్ని సినీమాకిచ్చేసి, మావు గడ్డి తినాలేట్రా? బేవార్సీ నా ఎదవ!" గురమ్మ పెద్దగా అరవటంతో జనం కొద్ది సేపు వినోదంలా చూసేరు.

"బామ్మ-మనవల్ల సరసం లెద్దూ!" అనుకున్నారు కొందరు.

"గడ్డి తింతావో, గాడిద గుడ్డు తింతావో, నాకెరికి నేదు. వుప్పుడు డబ్బులీయకపోతే మటుకి తాపుల్తింతావు!" ఒక పక్క సినీమాకి టైం అయిపోతుందన్న ఆరాటంతో వాడిలో అసహనం పెరిగిపోతోంది. ఇద్దరి మధ్యా మరో పావు గంట రభస జరిగింది.

వాడు గురమ్మని పచ్చిబూతులు జోడించి తిట్టడం మొదలెట్టేడు.

"అమ్మనాగుంజిగా... సెప్పు తీసుకొని సుబ్బరంగా మొత్తిగల్ను వోయీ వొరసా లేని సచ్చినోడా! ఇక్కడ్నుంచెల్తావా, నేదా?" అప్పటి దాకా కూర్చొనివున్న గురమ్మ పైకి లేవబోయింది.

అదే అదనుగా... "సావు నంజా!" అంటూ తన కుడి కాలుని పైకి లేపి బలం కొద్దీ గురమ్మ కడుపు మీద తన్నేడు.

"అమ్మనా గండో... సచ్చిపోనానమ్మా!" పెడబొబ్బ పెడుతూ అలాగే వెనక్కి విరుచుకు పడిపోయింది గురమ్మ.

రెప్పపాటులో దుప్పటి మడతల్లో వున్న డబ్బుల్ని చేతికి దొరికినన్ని తీసుకొని, అలంకార్ టాకీసుకేసి దూసుకుపోయి, జనంలో కలిసిపోయేడు మనవడు.

గురమ్మ అప్పటి దాకా మనవడితో సరదాగా దెబ్బలాడుతోందనుకున్న జనం, ఆ సంఘటనకి ఆశ్చర్యపోయేరు.

"అమ్మో! తన్నీసి పారిపోతన్నాడు, పట్టుకోండి పట్టుకోండి!" అరిచేరెవరో.

అక్కడికి దగ్గర్లోనే, బస్సు దగ్గిర డబ్బుల్ని అడుక్కుంటున్న సిట్టి, గురమ్మ కేకకి బెదిరిపోయి చూసింది.

అంతకు ముందే అక్క కొనిచ్చిన సోడాని తాగుతున్న రాజుకి కూడా గురమ్మ కేక వినిపించింది.

"ఒరేయ్ రాజుగా, దుంపల బామ్మ పడిపోనాది" అరుస్తూ, గాభరాగా గురమ్మ కేసి పరిగెత్తింది సిట్టి.

గురమ్మ ఎందుకు పడిపోయిందో సరిగా అర్థం కాని రాజు, చేతిలోని సగం తాగిన సోడాబుడ్డితోనే సిట్టిని అనుసరించేడు.

వాహనాలు హోరుబాజాలు మోగుతుండగా రంగురంగుల విద్యుద్దీపకాంతివలయంలో ముస్తాబైన పెళ్లికూతురిలా మెరిసిపోతోంది జగదాంబ జంక్షన్...! ■




నిద్ర ఆరోగ్యానికి మంచిదని అందరూ అంగీకరిస్తారు. పరిశోధకులు ఇప్పుడో కొత్త సమాచారాన్ని బయటపెట్టారు. దాని ప్రకారం పురుషుల కన్నా స్త్రీలే ఎక్కువగానూ, గాఢంగానూ నిద్ర పోతారని తెలిసింది. అందువల్లే స్త్రీలు, పురుషుల కన్నా ఎక్కువ కాలం బ్రతుకుతారనీ చెప్పారు. అంటే తమకు తెలియకుండానే స్త్రీలు, తమ ఆయువును పెంచే ఆరోగ్యసూత్రాన్ని పాటిస్తున్నారన్నమాట!

ఎస్.